దక్షకన్యా ప్రబోధము

నాటకము



దశకన్యా ప్రబోధము

నాటకము

గ్రంథకర్త: గేరా ప్రేమయ్య



క్రైస్తవ వాఙ్మయ సమాజము

THE CHRISTIAN LITERATURE SOCIETY
(In association with the United Society for Christian Literature)
POST BOX 501, PARK TOWN, MADRAS 3
and at
MYSORE BANGALORE TIRUVALLA

First printed, 1934
First printed by the C.L.S., 1956

PRINTED AT THE DIOCESAN PRESS, MADRAS—1956. A6613

తొలిపలుకు

గేరా ప్రేమయ్యగారు వ్రాసిన నాటకములు, కీర్తనలు, పెద్దల విద్య పుస్తకములు మొదలైనవి అనేకులకు పరిచయమే. ఈ దశకన్యా ప్రబోధ నాటకము వీనిలో ఒకటి. పదిమంది కన్యకలనుగూర్చిన ఉపమానము నాటకముగా తెలుగులో రచింపబడుట కిదియే ప్రథమ ప్రయత్నము.

ఈ నాటకమును నేను చదివి ఆంధ్ర క్రైస్తవ కౌన్సిలు ప్రచురములలో దీని చేర్చుటకు ఇది యోగ్యమైనదని భావించు చున్నాను. దీనిలోని నవీనరాగపు పాటలు, ఇంపైన కథా రచన, సులభశైలి ప్రజల నాకర్షించునని చెప్పుటకు సందేహము లేదు.

ఆంధ్ర క్రైస్తవ క్రైస్తవేతరులమధ్య ఈ నాటక మువ యోగకరముగ ప్రదర్శింపబడగలదని నమ్ముచున్నాను.

పి. జె. ప్రసాదరావు,
వాఙ్మయ కార్యదర్శి,
ఆంధ్ర క్రైస్తవ కౌన్సిల్,
హైదరాబాదు రాష్ట్ర క్రైస్తవ కౌన్సిల్.

గుంటూరు,
30-11-1955

ఈ నాటకమునందు వచ్చు పాత్రలు

1. డప్పు వాయించువాడు.
2. 5 గురు బుద్ధిగల కన్యకలు.
3. 5 గురు బుద్ధిలేని కన్యకలు.
4. పెండ్లి కుమారుఁడు.
5. రమణయ్య, } వరకులు.
6. కోటిరత్నం,
7. బాటసారి.

విజ్ఞప్తి

పాఠక మహాశయులారా!

నేనీ నాటకమును ప్రథమ కూర్పుగా 1934 వ సంIIలో జే. యస్. తామస్ మిశమ్మగారి సహాయమున ప్రచురించ గలిగితిని. మరల దీని పునర్ముద్రణము ఆంధ్ర క్రిష్టియన్ కౌన్సిల్ వారి దయవలన జేయబడినది. ఇందు నవీన రాగములతో నూతన పాటలు చేర్చబడినవి. ఇవన్నియు ఆధునిక ప్రజానీకమున కాహ్లాదకరముగా నుండునట్లు వ్రాయబడినవి. ఇందలి చేయబడిన సవరణలకు ఆంధ్ర లూథరన్ సంపాదకుడైన శ్రీ యన్. రాజారత్నము బి.ఏ, బి.ఇ.డి. గారు తోడ్పడిరి. వారికి నా యభివందనములు. దీనిలో ప్రభువు రెండవ రాకడ కవసరమగు విషయములు దైవగ్రంథానుగుణ్యముగా పొందు పర్చబడి యున్నవి.

ఈ కథ చదువువారందరు యేసుస్వామి రెండవ రాకడ విషయమై సిద్ధపడి తగురీతిని బుద్ధిగల కన్యలవలె ఆయన నెదుర్కొనుటకు సమర్థులగుదురని నా యభీష్టము.

గుంటూరు,
28-11-1955.

గేరా ప్రేమయ్య.

దశకన్యా ప్రబోధము

(ఏకాంకనాటకము)

రా—మోహన. పాట తా—ఆది.

(తెరలో అందరు కలసి పాడుదురు)

కనికరయుతుడైన ప్రభుని - కనుగొనవలెనండి ధరలో
అనవరతము మీకాయన దిక్కగు - ధనఘన భాగ్యంబులు గల
నిధియగు ॥కనిక॥

1. పాపులగాసను - ప్రాణము బెట్టెను - దాపురు రండని
దయతో బిలుచును = మోయలేని మన శాపభార
మును - నాపి తనదు కృపజూపి బ్రోచును ॥ కనిక ॥

2. మనమున నమ్మిన - మానవులందరి - వినయపు ప్రార్థన
లను విని గాచును=కినుకక తనువును మన సమస్త
మును - నెనరున దేవునివని నర్పింతము ॥ కనిక ॥

3. పరమ రక్షకుడు - పావనచరితుడు - మరణము గెలిచిన
మహాజయశీలుడు=శరణని వేడిన నరులందరికిని - కరు
గని దీవెనలను గురిపించును ॥ కనిక ॥

సూత్రధారిణి.

కం. శ్రీమరియ గర్భజనిత
ప్రేమాన్వితా! క్రీస్తు ప్రభువ - విమల సుచరితా!
క్షేమంబు నొసగి గావను
నామంబున వేడుకొందు - నయగుణ వినుతా.

న. సర్వ ప్రపంచ నిర్మాతయగు శ్రీ యెహోవా దేవుని మహిమాప్రభావంబు నెఱింగి యాత్మానందంబునుం బొంద, నాశించి కాంబోలు నీయార్యబృంద మంతయు సభామంటపము నలంకరించె, సఖి యిటురమ్ము!

నటి:—(తెరలోనుండి) అలికులవేణీ! వచ్చుచున్నాను. ఆలస్య మైనందున క్షమింపుడు. వార్తలేమి?

సూత్ర:—ఇటు చూడుము. విద్వజ్జనవిభూషితంబై, రసికవరవరీవృతంబై, మహీనాథసనాథంబై, యీ సభ యెంతయామోదజనక మగుచున్నది.

నటి:—ఆర్యపుత్రీ! యీదినమింత జనము వచ్చుటకుఁ గల కారణమెద్ది?

సూత్ర:—అయ్యో! ఈ కారణమింకను నీకు తెలియదా? నేటిదినము దశకన్యాప్రబోధ నాటకము ప్రదర్శింపఁబడును.

నటి:—ఈ విషయము నా కగోచరముగా నున్నది. దశకన్యా ప్రబోధమన నేమి?

సూత:—పరలోకరాజ్యము తమ దివిటీలఁ బట్టుకొని పెండ్లి కుమారు నెదుర్కొనుటకుఁ బయలుదేరిన పదిమంది కన్యకలనుఁ బోలియున్నది. అందులో నైదుగురు బుద్ధిగలిగి సిద్ధపడి క్రీస్తుస్వామి రాజ్యములో బ్రవేశింతురు. తక్కిన యైదుగురు బుద్ధిలేక సిద్ధపడక, ఆయన రాజ్యమునకు దూరస్థులగుదురు. ఇది యా ప్రభువు తన రెండవరాకకు సిద్ధపడుటనుగూర్చి చెప్పిన యొక యుపమానము.

నటి:—ఆర్యపుత్రీ! ఈ విషయము వినుటకు నాస్వాంతమున నెంతో వింతగానున్నదే? ఆస్వామి మొదటిసారి వచ్చి

మరల రెండవసారి రాఁబోవుచున్నాడా? ఆహా యెంత యాశ్చర్యకరమైన సంగతి? ఆ ప్రభువు మొదటవచ్చిన విధము వచ్చి లోకములో జీవించిన జీవితము, ఆయన జీవితములో జరిగినసంగతులు కొద్దిగాఁ దెలుపఁగలవా?

సూత్ర:—సఖియా! ఆలాగైన పాపోత్పత్తియొద్దనుండి, ముఖ్యమైన సంగతులను ముక్తసరిగా దెలుపుచుఁ వచ్చెద వినుము.

సీ॥ ఆదిదేవుఁడు తొలి - యారుదినములందు
జలముచరాచర - చయము నవని
వాక్కు వలనె తండ్రి - వరుసగ సృజియించి
కడస వ్వ నాదాముఁ - గలుగ జేసి
ఘనముగ నేదేను వనమధ్యమునఁ దినఁ
రాని ఫలము వాఁ - రలకుజూపె
కపట సాతానుఁడు - కర్కడ జేరి యవ్వకు
దినరాని యప్పుఁడు - దినగ నేర్పె

ఆ॥ వె॥ అంతఁదినక నామె - కొంత మిగిల్చియు
తనదు భర్తకపుఁడె - తినగ నివ్వ
తెలియ లజ్జ తమకు - గలుగగ నాకులు
మొలకుజుట్టి దాగి - మూర్ఖులైరి.

వ. ఈ విధముగ మన మొదటి తల్లిదండ్రులు, దేవుని కవిధేయులై, యాయన పిలుపునకు దాగియుండి శపించఁబడిన వారై చావు సంప్రాప్తింపఁజేసికొని సర్వలోక దుష్పాప ప్రారంభికులైరి. అయినను దేవుఁడు కృపాసముద్రుండు గాన వారి శాపవిముక్తికై రక్షణవాగ్దానమును గూడ అనుగ్రహించి

యున్నాడు. అదేదన సాతానుయొక్క తల చితుకబొడుచు టకు స్త్రీసంతానము నుండి యొక రక్షకుఁ డుద్భవించును. ఈ రక్షకుఁ డుదయించినవిధము చాల చిత్రమైనది. ఎట్లనగా?

పాట. చాయ:—అందము చూడవయా

ఎంతానందమమ్మా - యేసుబుట్టెనమ్మా = వినగా నా జన్మంబు - వింతౌనమ్మా ॥ ఎంతా ॥

కన్యయైన మరియాంబ గర్భమందున - మాన్యుండు గాబ్రియేల్ మాటయుందు ॥ ఎంతా ॥

1. బేతాలేము బీద పాకలోన - పసులతొట్టిలో పరుండె నమ్మా = పాత్రిగుడ్డలైన బొత్తిగా లేక పవళించె ప్రభుండేసుడమ్మా ॥ ఎంతా ॥

2. గొల్లలెల్ల గొప్ప పాటలతో - దూతమాట విని వెళ్లి రమ్మా = కళ్లజూచి చిట్టివాని తొట్టిలోన - మళ్లిరంతట జాటుచు కన్నవార్త ॥ ఎంతా ॥

3. గగనమందు, తోకచుక్క బుట్ట - ఎగయజూచి రాజ్ఞాను లావింత = మిగులైన బంగారు సాంబ్రాణి బోళం - తగురీతిగ నిచ్చియు మ్రొక్కిరంత ॥ ఎంతా ॥

న. ఇట్టి యద్భుతజన్మగల యేసు ముప్పది వత్సరముల వరకు నిహాలోక జననీజనకులకు లోబడి, దేవుని దయయందును, మనుష్యుల దయయందును, యభివృద్ధినొందుచు ముప్పది యొకటవ వర్షమునుండి, తన పని ప్రారంభించి మూఁడు వత్స రములలో నా పని దైవచిత్తానుసారముగా జరిగించి ముగించి యున్నాఁడు. గాని తన స్వజనులే యాయనను మెస్సియ

యని యొప్పుకొనక దైవదూషకుఁడని యెంచి, నిరాకరించి గర్వములు బెంచి ఆయనను పొంచి, పట్టిచంపఁ బ్రయత్నించు చుండిరి. ఇట్లుండగా,

పాట. చాయః—రైతు జనములా పండుగ

యేసు శిష్యుడే యిస్కారియేతుడు - మోసాకారి యూతడు, నాశించి సొమ్మును, పట్టించె ప్రభువును ॥ యేసు ॥

1. ముప్పది రూకలుబట్టి - ముద్దుతోడ - గొప్ప కీడును జేసె గోటుమీర = అప్పుడే చుట్టముట్టిరి - తిప్పలు బెట్టిరి ॥ యేసు ॥

2. కరుణ మనసును లేక - కఠినపరుడు - గురుని ద్రోహము జేసె పరువులేక = ధరలో బల్ నింద బొందెను-స్థిర తేమిలేకను ॥ యేసు ॥

వ॥ అప్పుడు పొంచియున్న యూదులు కత్తులు, గుదియలు, కర్రలచే మొత్తముగా ప్రభుని గొంచుపోయి, కొట్టి తిట్టుచు సిలువకొయ్యను కల్వరిగిరి వరకు మోయించి

ఉ॥ చేతులు గాళులున్న దర - జేసియు లోతుగ జీలమేకులా పాతకులాతఁడే ప్రభుని - బాధలు బెట్టుచు దూలనాడుచున్ నీతియు లేక నెత్తిపయి - నిర్దయముళ్ల కిరీటముంచి యూ ఘాతకు లెన్నో రీతులను - కర్తను హింసలుబెట్టె రక్కటా! ॥

వ॥ అయితే యూ దైవస్వరూపి యట్టి హింసకులను శపించక యెరుఁగని పామరులని వారికొరకై తన తండ్రియైన దేవుని బ్రార్థించుచు ప్రాణముఁవీడెను. అంతలో నొక కఠిన బటుఁ డతివేగమున వచ్చి

తే॥ గీ॥ యేసు జీవించెనా? ఇంక - నేమియంచుఁ
గన్ను లెఱ్ఱగఁజేసియుఁ - గఠినపరుఁడు
బల్లెమెత్తియు పొడువగా - బ్రక్కనుండి
నల్లనీరొల్కె - నరకుల నెల్లఁ బ్రతుక ॥

వ॥ తదుపరి యూదునను నమ్మిన అరిమత్తయి నివాసుఁడైన యోసేపు క్రీస్తు శరీరమడిగి సిలువపైనుండి క్రిందికి దించి తనకొరకై తొలిపించుకొన్న రాతిసమాధిలో బెట్టి దానిపై నొక రాయి బొర్లించి వెడలెను. అయితే యూదులా శరీరమును తన శిష్యులే తీసి దాచి యాయన తిరిగి లేచెనని ప్రచారము చేయుదురని యా సమాధిపై రాజుగారి ముద్ర గొట్టించి కాపువారిని గావలి యుంచిరి. అయినను యా మహానీయుఁడు పరిశుద్ధుఁడు గనుక

పాట. వరుస:—కిలకిల నవ్వుల

మన ప్రభు లేచెను - మరణంబు గెలిచి = మహిమను చూపమును - బూని యీ ధరణిన్ ॥ మన ॥

1. గురుని దేహమునకు - పరిమళంపు తైలమున్ - మరియ సలోమియును - మగువలు సబ్బాతున = సరగ దీసికొని సమాధి కరుగ దెంచగన్ - ఎరుక జేసెను దూత ఘనుడు లేడని ॥ మన ॥

2. పదునకొండుమార్లు - పలుస్థలములందున-పృథివి శిష్యులకు - ప్రత్యక్షమాయెన్ = మదిలోనున్న సందియంబును మాన్పెన్ - కొదువలేక తన్ను వేడమని కోరెను ॥ మన ॥

వ॥ మరియు నప్పరమాధికారి యారోహణమగు తుదిదినంబును సహా తన శిష్యవర్గమునకు ప్రత్యక్షమాయెను.

నటి:—ఏమీ! యేసు మృతుఁడయి లేచి తన శిష్యాళికి పదునా కొండు మారులు ప్రత్యక్షమైనాడంటివి. తుది దినమున సహా యారోహణ మగుచు ప్రత్యక్షమైనట్లు రూఢిపర్చితి విదియెంతో వింతయైన సంగతి.

సూత్ర:—అంతియేకాదు. తన సువార్త నెల్ల లోకములఁ జాటింపుడని యాజ్ఞనిచ్చి యంతర్ధానుఁడయ్యె.

నటి:—అయితే త్రియేక దేవునిపేర మనము బాప్తిస్మము బొంది తిమిగదా? మనకున్న నిరీక్షణయేది?

సూత్ర:—అయ్యో! ఎంత వెఱ్ఱిదానవు. మన ప్రభువు రాకను గూర్చి నిరీక్షణ లేదా?

క॥ నేనుండెడి స్థలమున నే
మానుగ మీరుండునటుల - మరిగొని జనెనే
దానముగ మీకు తావును
మానితముగ నేరుపరచి - మరిగొని జనెదన్,

వ. అని యా సర్వాధికారి నుడివెను. ఆయన కొఱకు మన మెదురు చూచుటయే మన క్రైస్తవగురి. అన్యమతముల కును క్రైస్తవ మతమునకును గల ముఖ్య వ్యత్యాసమిద్దియే గదా? వారి మతస్థాపకులు మరణములో నంతరించిరి. వారి మచ్చు మాసిపోయెను. గాని మన ప్రభువు జీవించి పర లోకపు తండ్రియొక్క కుడిచేతివైపున కూర్చుండి యుండెరు గదా? క్రైస్తవులమైన మనఁకాయన రాకడ మన మరణ మునకై గాదుగాని నిత్యజీవము పంచిపెట్టుటకే, గావున మన మత్యంతానురాగముతో నాయన రాక కెదురు చూడవలెను.

నటి:—ఔనౌను. పరిశుద్ధుఁడైన మత్తయి వ్రాసిన సువార్తయం దిరువదియైదవ యధ్యాయములో మొదటి పదమూడు వచనములలో నీసంగతి యున్నట్లు జ్ఞాపకమున్నది.

సూత్ర:—ఇంకనేమి? రానైయున్న యాప్రభువే పెండ్లికొమరుఁడు. ఈయన వచ్చుతఱి మనము మెలుకువ గలిగి యున్నయెడల వివేకులైన పంచకన్యలను బోలియుందుము. లేనియెడల నవివేకులై మాంద్యముగలిగి దుఃఖముఁ కును కటికటికటికిని పాలైన పంచ నిర్భాగ్యకన్యలకుఁ బట్టిన గతి మనకునుఁ బట్టవచ్చును.

నటి:—ఆహా! ఒక విధముగజూచిన నిది చాలసంతోషకరమైన వార్త గాని సాతానుబలమధికమై మనమును మన సంఘ సభ్యులును అజాగ్రత పాలైనయెడల కాలుజారి కందకమునఁ బడ్డ కరిచందంబున విలపించవలసినదే, గావున మనతోఁ బాటు మన సభ్యులనుగూడ మెలుకువలో నుంచవలెను.

సూత్ర:—అందుకొఱకే 'దశకన్యా ప్రబోధ' మను చిన్ననాటకమును ప్రదర్శింపఁబోవుచున్నాము. గాని దేవాలయములందు ప్రసంగసమయమున కునికిపాట్లుబడు కూళలకు డప్పుదెబ్బ కర్ణకఠోరము గాదు గాని చెవుల విందుగా నుండును, గాన డప్పు వాయించువాని బంపి మన రక్షకుఁడైన యేసుస్వామియొక్క రెండవ రాకనుగూర్చి చాటింపులు జేయింతము రమ్ము. ఇప్పటికే చాల సమయము మించి పోయినది. మనము పోయి పాత్రలను సిద్ధము సేయకున్న సభ్యులు విసికి కొందురు. త్వరగా వెడలుదము రమ్ము.

(నిష్క్రమింతురు)

డప్పు వాయించువాడు

ఈ టముక్కు ఎల్ల అందరికి తెల్పేదేమంటే, పెద్దోళ్ళు, పిల్లోళ్ళు, మొగోళ్ళు, ఆడోళ్ళు, అందరు వినండో హోయీ! సెప్పలేదనేరు, వినలేదనేరు, నాకోంపదీసేరు. సర్వలోక మహా చక్రవర్తిగారి జ్యేష్టకొడుకు పెండ్లి ఊరేగింపంట, యెప్పుడో జరుగుద్దంట, అప్పుడు గొప్పభూరథోనితోను మహా యార్భాటంగా వుండునంట, ముందెవరు సిద్ధపడి ఆ సంతోషములో పాలుబొందుదురో వారికే ఆసున భాగ్యమబ్బునంట. ఒక బీదనిలేదు, సాధనలేదు, కులమనిలేదు, గోత్రమనిలేదు, ధనవంతుడనిలేదు, ధనయీనుడనిలేదు, ముసలనిలేదు, పిల్లనిలేదు, గుడ్డనిలేదు, కుంటనిలేదు, మూగనిలేదు, మతకనిలేదు, అన్ని తెగలవాండ్లకి ఒంట బండిందో హోయీ!

కూడములోగాని, గుడ్డలోగాని, సుఖంలోగాని, ధనంలోగాని, శాంతిలోగాని. కాంతిలోగాని, యింక దేనిలోనన్నగాని యే కొదువయు లేదో హోయీ!

ఆ ప్రభువుతో వుండేవాండ్లకు, కచ్చలు, అసూయలు, మచ్చరలు, జారచోరకుత్యములు, ఆశలు, మోసాలు, రోసాలు, యేమియు యుండక పసిబిడ్డల బుద్ధితో వద్దికగా యుందురో హోయీ! అంతేకాదు అక్కడ తాంబూరలు, వీణెలు, మద్దెళ్లతో సంగీతగానములతో, సింహాసనముమీద కూర్చున్న వాని యెదుట ఆనంద సుఖాలు అనుభవించెదరో హోయీ!

నా మాట వినని వారికి నరకమే ఆ స్వామి భాగ్యమబ్బక గొప్ప దెబ్బతగులును కనిపెట్టండో హోయీ! ఆ నరకములో యెప్పుడు చీకటేనంట, మహావేదనంట, అగ్ని ఆరదంట,

పురుగు చావదంట, పండ్లు పటపట కొరుకుచు కండ్లు మూసుకొని, ఘోర రోదన సేయుదురంట. బాగా తలచండో హాయీ ఆయనను గూర్చి! యింటింట పూజలు సెయ్యాలె. పాటలు పాడాలె, ఆటలాడాలె, అందరమును ఆనందంగుండి నా యయ్యగార్ని యెదుర్కొని ఆయనదబ్బాలో దర్శనం జేసుకోవాలె నో హాయీ!

మంచికాలము మించిపోతే రాదు. యేసిన తలుపు తీయబడదు. తర్వాత యెనకబడి యేడ్చిన లాభం లేదో హాయీ!

(నిష్క్రమించును.)

దశకన్యా ప్రబోధము

ప్రథమ రంగము

(పదిమంది కన్యకల ప్రవేశము)

బుద్ధిగలవారు ఒకప్రక్క. బుద్ధిలేనివారు రెండవప్రక్క.
బుద్ధిగలవారు సిద్దెలు దివిటీలతో వచ్చెదరు.
బుద్ధిలేనివారు వట్టి సిద్దెలతో మాత్రము వచ్చెదరు.

1 బు-క:—చెలియలారా! కాలయాపనము జేయుట మంచిది గాదు. పెండ్లికుమారుఁడు వచ్చువేళ యైనది

సీ॥ ఆలస్యమును జేయ - వీలుగానగరాదు
త్వరితంబుగా రండు - తరుణులార
నిమిషమాత్రంబైన - నిలచియుండుటకును
నేదికాల మిపుఁడు - నేస్తులార
మాపివేసియుమీర - లందరు మాటలు
కాలు సాగగనీండు - కన్యలార
యరుగుదెంచుచు నుండె - నవె ధ్వానములుజాల
చెప్పుచుండ వినరు - చెలియలార?

తే॥ గీ॥ సిద్దెలన్నిటిలో నూనె - సిద్ధపరచి
కాగడాలన్నిటిని జాలఁ - గట్టిపరచి
పెండ్లిపాటలు బాడుచు - ప్రేమతోడ
వేగఁమేగుద మిప్పుడే - వెనుకఁ బడక.

వ. "మరియు అతడు రెండవజామున వచ్చినను మూడవ జామున వచ్చినను (ఏదాసులు) మెళుకువగా నుండుట కనుగొనునో ఆదాసులు ధన్యులు." లూకా 12:38.

1 బు-లే-క:—ఆ! నీ మాటలకేమి? ఊరేగింపంటే యూర కున్నదా?

ఆ॥ వె॥ పట్నమంతదిరిగి - బలు విధంబులుగాను
చిట్టచివరు నగరు - జేరవలయు
వచ్చు పెండ్లికొడుకు - నిచ్చోట కనియును
ముందుకబురు కేక - నందవలయు.

వ. అక్కా! నే జెప్పు వాక్యములు నీ మనసున కెక్కినవా? టక్కరిమాట లేల బల్కెదవు. నిక్కమముగా నా మాట వినుము.

రాగం—కాంభోజి. పాట తా—ఆది.

ఏమిటింత వేగిరం-స్వామి వచ్చుసమయ మిదియా? ॥ఏమి॥
= లెండి రండిపోదమనియు - దండనంబు జేతువే ॥ ఏమి ॥

1. సంభ్రమంపు ధ్వనులు నా-యంబరమున వినఁగబడవె-
అంత దెలసియుండ నీ - కింతయాతుర తెందుకు ॥ ఏమి ॥

2. ప్రభువు తనయ వెంట ప్రజలు - భుగ భుగమని పగలఁ బడ-తకతక శబ్దములురాగ - పకపకలాడుచు పోదము ॥ ఏమి ॥

2 బు-క:—ఏమీా చాతుర్యము? తాఁజెడ్డకోతి వనమెల్లఁ జెరచి నట్లు, నీవు జెడుటయేగాక మమ్మునుఁ జెరుపఁ సాహ సించితివా?

ఆ॥ వె॥ నీదుమాటవినిన - నీళ్ళమూటను పోలి
తెల్పుచుంటి విప్పుడు - తేటగాను
తాతకెటుల నీవు - దగ్గనేర్పం జూతు
తగవె యిటులఁ జెప్ప - దరుణి నీకు.

రాగం-పీలు. పాట ఆదితాళము.

మోసపుమాటలు - చేటువినుడి మీరు - నాశజెందిన చెలియలార = లేశమైనను నిలుచుటకును - లేదుసమయంబు మనకును ॥ మోసపు ॥

1. ముందేసిద్ధముగాను - ముఖ్య సంగతివిను - యెందు వెదకిన భాగ్యమిదిగను = మందమతులైతిర హీన - యంధకార ప్రాప్తె యను ॥ మోసపు ॥

వ. "దినములు చెడ్డవి గనుక మీరు సమయమును పోనియ్యక ఉపయోగము చేసికొనుచు అజ్ఞానులవలె గాక జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఇందునిమిత్తము మీరు అవివేకులుకాక ప్రభువుయొక్క చిత్త మేమిటో గ్రహించుకొనుడి." ఎఫెసీ 5:15-17.

2 బు-లే-క:—ఏమమ్మా నీవును కడు తెలిసినరీతిగా వాగు చున్నావే! దీనిలో మోసమేమి? దోషమేమి? మేము బల్కినవి మీ వీనుల కంటరోతయా!

ఆ॥ వె॥ నిమిషమైనఁగాని - నిద్రఁబోదుముగదా?
యింత తొందరేల - యింతులార
దాపు కరిగినంత - దగుజాగరూకత
బరుగుఁ దీయవచ్చు - ప్రభునిజేర

వ. ఇప్పటికొక యానవాలైన గాన్పించలేదే? చెప్పి నప్పుడు వినిపించుకోరే? యేమీయాశ! తానొకటిదలంచినం దైవమొకటి దలంచుననుమాట మరచితిరా? అయినను దొంగకు తలుపుదీసి దొరని లేపువారలుమీరె. ఎందుకు మమ్ము మోసపర్చి మా నిద్రకు భంగము కలిగించెదరు?

పాట—(ఈ పలుకుల కీ కులుకులవలె)

పొందు మీరు చెప్పిన వినము - పొత్తుమీతో మాకేల - పొసగును నిజము ॥ పొందు మీరు ॥

1. మేము మీరు సంఖ్యకు నొకటె - స్వామిదర్శన చేయుటకు = ఏమిమాకు బుద్ధులునేర్ప - భువిని మీరు వెలసి యుంటిర ॥ పొందు మీరు ॥

3 బు-క:—కుబుసము విడిచిన త్రాచుపాము విధమున మాపై యింత పౌరుషంబుఁ జూపించుటేల? "ప్రభువు కేది ప్రీతి కరమైనదో దానిఁ బరీక్షించుచు వెలుఁగు సంబంధులవలె నడుచుకొనుడి. నిష్ఫలమైన అంధకార క్రియలలో పాలి వారై యుండక వాటిని ఖండించుడి." ఎఫెసీ 5:10-4.

ఆ॥ వె॥ పందెమాడుటెంత - బరువు హీనతమ్ము
ముందె బోవుటకును - యందరమును
యింత పంతమేల - యిది మీకు మర్యాద
కొంత తెలివిదెచ్చు - కొనుడి మీరు

వ. "నిబ్బరమైన బుద్ధిగలవారై మెళుకువగా వుండుడి మీ విరోధియైన అపవాది గర్జించు సింహామువలె యెవరిని మ్రింగుదునాయని వెదకుచు తిరుగుచున్నాఁడు." I పేతు. 5:8.

పాట. చాయ.—శ్రీరామ సీతారామ

రారండి చెలియలారా - రారండి పోదం = రారండి పోదం - జాగేలా? జాగేలా? ॥ రారండి ॥

1. సోమరి వారియొక్క - జోక్యమదేల = రారండి పోదం - జాగేలా? జాగేలా? ॥ రారండి ॥

2. జాము ప్రొద్దుందని - నేమారకండి = రారండి పోదం - జాగేలా? జాగేలా? ॥ రారండి ॥

3 బు-లే-క:—చాలుచాలు కొంచమాగు యీ చేతజేసి ఆచేత ననుభవించినట్లు జెప్పుచున్నావే? పేదవారి కోపము పెదవికి చేటు. మేమెల్లరము సోమరిపోతులమును, మీరెల్లరుఁ గష్టజీవులా? అయినను మీరు ధీశాలులు. బుద్ధిచాతుర్యములు గలవారు, ఎవ్వరేని వ్రేలుఁజూపినఁ జెయ్యిఁ మ్రింగువారు, తలదూర సందుదొరికిన మేనులు దూర్చి కాపురము సేయువారు, యింతటి ప్రజ్ఞావంతులు జెప్పునపుఁడు విన కుంటె యెట్లు?

సీ॥ మాకంటె మీరెంత - మాన్యులై యున్నారు
దైవభక్తి దలంచి - దరచిచూడ
మాకంటె మీరెంత - మహితులై యున్నారు
ధనధాన్యముల యందు - దలఁచిచూడ
మాకంటె మీరెంత - మానితమతులైరి
విద్యాధి విషయముల్ - విప్పిచూడ
మాకంటె మీరెంత - ప్రాకట యుతులైరి
పనిపాట లన్నిటిఁ - బట్టిచూడ

తే॥ గీ॥ అన్ని విషయములందున - నధములయ్యు
వెఱ్ఱి బుద్ధులు నేర్పగ - విందు మన్న
మేటినాథు నెదుర్కొన - మేమె ముందు
పోయి కలసెద మేమొగా - పొలతులార!

వ. కూతలు బొబ్బలేగాని కుప్పలో నొక విత్తులేదు.

4 బు-క:—అబ్బో! మంచిజెప్పుట వీరల కెంతో సెబ్బరిగా నున్నదే? మేలునకు బోతె కీడు వెంటాడినట్లున్నది. “అమ్మలారా! ఐశ్వర్యవంతులును దరిద్రులును కలిసి యుందురు. వారినందరిని గలుగఁజేసినవాఁడు యెహోవాయే.” సామెతె. 22:2. “మరియు గొప్ప ఐశ్వర్యము కంటె మంచిపేరును, వెండి బంగారముల కంటె దయయు కోరదగినవి.” సామెతె 22:1.

ఆ॥ వె॥ చమురు ముందుగొనియు - జను టెంతొ మేలని
జెప్పుచుండ మీకు - జెడుగు దోచె
నర్ధరాత్రి నిద్ర - నందెడి తఱినూనె
నిచ్చువార లెట్టు - లీయగలరు.

వ. ముందే మేల్కొని పెండ్లికుమారుఁ నెదుర్కొనుటకు గావలసిన సామగ్రి సమకూర్చుకొనుట కిదియే సమయము. హఠాత్తుగావచ్చి తటాలున తలుపుఁమూసిన మనగతి యేమి ఆ విందులో వియ్యమొంద వీలుపడదు గదా!

రాగం—నాథనామక్రియ పాట ఆదితాళము.

చెప్పివచ్చునా? తావచ్చు దినమిచ్చోటకు - చెప్పివచ్చునా? రేపొ మాపొవచ్చెదనని - డపేదారులనుబంపి = తప తప శబ్ధములుగొట్టి - తలుపుఁ తెరచి రండనియు ॥ చెప్పివచ్చునా ॥

1. ఇచ్ఛయుండినవా - రెచ్చయైన వెదకిగాని=అచ్చెరు వందివాని - ముచ్చటించుచు బోదురుగద ॥ చెప్పివచ్చునా ॥

2. రాక దెల్పగా బో - ధకులముగాము మేము మీాకు = సాకులేల? యాపిమీా పరాకులేక లేచిరండి ॥ చెప్పివచ్చునా ॥

4 బు-లే-క:—బహు విపరీతముగా మాటలాడు చున్నారే? చెప్పిరానని మీాతో స్వయముగావచ్చి చెప్పినా? ఎందుకు ముందటికాళ్లకు బంధములు వేసెదరు, మాకు పుట్టగతులు లేనట్లుగా గూడ జెప్పుచున్నారే? ఇచ్చేవానిని చూచిన చచ్చేవాడైన లేచునట. నర్తకులకొకరు చెప్పవలసిన విషయమా? డబ్బుంటే కొండమీాది కోతియైన దిగిరాదా? మీా వేషాలన్ని గ్రాసాలకే

ఆ॥ వె॥ కోరిమేము వెళ్ళ - కోమటిలేవడ
పైకమిదిగో నన(గ - బదిలముగను
మాకుచాలవతను - మార్గములున్నవి
అప్పుదెచ్చుటకును - యెప్పు(డైన.

వ. దాపునకు రావలెనేగాని వచ్చిన యెంతలోకి! దివిటీలు మా స్వగృహముల యందు సిద్ధముగానే యుండె. సిద్దెలలోని చమురు విషయమైగదా ఇప్పుడు వచ్చిన తిప్పలు అయిననేమి? నొక్క క్షణములో(దెచ్చి వెలిగించుకొనిపోవు శక్తి సామర్థ్య ములు మాకు(గలవు.

5 బు-క:—మీాకంత సామర్థ్యమున్న సరే? మీా యిష్టానుసార ముగా నూరేగుడు. మేముమాత్ర మిప్పుడే పోయి కావలసిన చమురు సిద్ధపర్చుకొని యా మహానీయు నెదు ర్కొందుము. (తనవారివైపు తిరిగి) "నిద్రబోవువారు

రాత్రివేళ నిద్రబోదురు. మత్తుగా నుండువారు రాత్రి వేళ మత్తుగా నుందురు. మనము పగటివారమై యున్నాము. గనుక మత్తులమైయుండక విశ్వాస ప్రేమ లను మైమరువును రక్షణ నిరీక్షణయను శిరస్త్రాణమును ధరించుకొందము." I థెస్స. 5:7–8.

తే॥ గీ॥ వారితో నేల పోటిక – వలను పడదు
సాగదీయుట మనకది – సరియుకాదు
పంచకన్యలమైనను – బనికిరాము
సాగుసాగుఁడు త్వరగను – చముర కొరకు.

వ. మీరింకేల సందేహపడుచున్నారు? "వీరైతే తాము గ్రహింపని విషయములనుగూర్చి దూషించువారై వివేక శూన్యములగు మృగములవలె వేటిని స్వాభావికముగ యెరుగు దురో వాటివలన తమ్మును తాము చెరుపుకొనుచున్నారు. అయ్యో! వారికి శ్రమ. యూదా 10. చంక జారుచున్న బిడ్డ నెందాక యెగవేసి యెత్తుకొందురు. వారు కేవలము మూర్ఖాభిప్రాయులు సుమీ? కాలిచెప్పు అంటివస్తే తప్ప యంటరాకున్న నింటిలో విడిచివెళ్లడా? ఇంత వాదమేల, ఎవరి మేలు వారు గానరా! అవివేకితో స్నేహముకన్న వివేకితో విరోధమే మేలు.

1 బు-క:—అయినను చివరగా నీయొక్కసారి హెచ్చరిక జేసి వెళ్లుదము. వినిన సరి. వినకున్న యెవరి మూర్ఖత వారినే కొట్టును. (బు. లే. వారితో) ఏమమ్మా మీరు మాతో చేరగోరరా? ఎందుకు మోసపోయెదరు. "ఆకాశము క్రింద ఒకదిక్కునుండి మెరుపు మెరసి ఆకాశముక్రింద

మరియొక దిక్కున కేలాగు ప్రకాశించునో ఆలాగున మనుష్యకుమారుఁడు తన దినమున నుండును." లూకా 17:24.

2 బు-క:—"నోవహు దినములలో జరిగినట్లు మనుష్యకుమారుని దినములలోను జరుగును. నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు జనులు తినుచు త్రాగుచు పెండ్లాడుచు పెండ్లికియ్యబడుచు నుండిరి. అంతలో జలప్రళయము వచ్చి వారినందరిని నాశనము చేసెను." లూకా 17:26-27.

3 బు-క:—"లోతు దినములలో జరిగినట్లు జరుగును. జనులు తినుచు త్రాగుచు కొనుచు అమ్ముచు నారునాటుచు యిండ్లు కట్టుచు నుండిరి. అయితే లోతు సొదొమను విడచి పోయిన దినమున, ఆకాశమునుండి అగ్నిగంధకములు కురిసి వారినందరిని నాశనము చేసెను. ఆ ప్రకారమే మనుష్యకుమారుఁడు ప్రత్యక్షమగు దినమున జరుగును. లూకా 17:28-30.

4 బు-క:—"ఆ దినమున యింటి మిద్దెమీఁద నుండువాఁడు యింటనుండు సామగ్రిని తీసికొని పోవుటకు దిగకూడదు. ఆలాగే పొలములో నుండువాఁడును తాను విడిచిపెట్టి వచ్చిన వాటి కోసరము తిరిగి రాకూడదు." లూకా 17:31.

పాట. ఛాయ:—సుందరాంగ మరువగలేను

రాజు రాక బహు తేజోమయము, రా రండి = మన పూజలు గొనె - విరాజితుండే లే లెండి ॥ రాజు ॥

1. లోకభ్రమలు చీకుపరచు - సాకేలా = యాకారము మార్చివచ్చిన ప్రభుని గనరే యిలలోన ॥ రాజు ॥

2. క్షేమకరుడు ప్రేమపరుడు - స్వామి యా ఘనుడు = సమభావం గలిగిచూచె సత్యుని కడకరుదేర ॥ రాజు ॥

3. మోక్షపదవి రక్షకుడిచ్చు - తక్షణంబే = కక్షలన్ని వీడి లక్ష్యముంచి నాథుని జేరుటకు ॥ రాజు ॥

5 బు-క:—వ. "లోతు భార్యను జ్ఞాపకము చేసికొనుడి." లూకా 17:32. పాతమనసు తీసివేసి నూతనంపు గుణము పొందుడి. ఆహా! మీరెంత కఠినపరులు, మేమెంత జెప్పినను మీ స్వాంతము కొంచెమైనను గరుగకున్న దే? తాబట్టిన కుందేటికి మూడేకాళ్లను మూర్ఖులు మీరేగదా!

1 బు-లే-క:—వ. ఈ యుడతూపులకు వేపలు కదలుననియా? నేటికి మీ యెదుట మూర్ఖులమైతిమి మృగములమైతిమి.

పాట. చాయ:—ఏరువాకా సాగాలో

కఠినపు హృదయము గల్గినవారు - కన్నుమిన్ను గానని వారు = చాల శిక్షను బొందెదరో యమ్మో చెల్లెమ్మ - మే లెన్నడు వారి కబ్బదోయమ్మో బుల్లెమ్మో ॥ చాల ॥

1. మంచి జెప్పిన - మనసే లేకను - వంచితాత్ములై వదరు చుందురు = కొంచమైన మన మాట విన్నను - అంచితంబు గానందమొదవును ॥ చాల ॥

2. బుద్ధిలేకను మొద్దుకన్యలు - సిద్దెలన్నియు సిద్ధపర్చిరి = శ్రద్ధలేకను చమురు గూర్చక - బద్ధకంబు మైకంబు నొందిరి ॥ చాల ॥

3. ఎంతగానో మూర్ఖంబు జూపియు - వంతమాడి ఫలితంబు వీడియు = చెంతజేరి మన చమురు అడిగియు - చింత గలిగి - చీకాకు బొందిరి ॥ చాల ॥

వ. కీడు మేలనియు, మేలు కీడనియు జెప్పుకొని చీకటి వెలుగనియు వెలుఁగు చీకటనియు నెంచుకొనువారికి శ్రమ. చేదు తీపనియు, తీపి చేదనియు నెంచువారికి శ్రమయని యెషయా 5:20 లో నొక్కి వక్కాణించుచున్నది.

శ్లో॥ ఉపకారేణ నీచానా మపకారో హి జాయతే
పయః పానం భుజఙ్గానాం కేవలం విషవర్ధనం॥

అనగా, నీచుల కుపకారము జేసినను, నది యపకారమే యగు. ఎట్లన పామునకు పాలుబోసి పెంచినను అది మరింత విషమును వృద్ధిచేయును గాని, యేమి ప్రయోజనము?
బు-క:—(అందరు)

5 బు-క:—వ. "మీ హృదయము లొకవేళ తిండి వలనను మత్తువలనను ఐహికవిచారముల వలనను మందముగా నున్నందున ఆ దినములు అకస్మాత్తుగా మీ మీదికి ఉరివచ్చి నట్లు రాకుండ మీ విషయమై మీరు జాగ్రత్తగా నుండుడి." లూకా 21:34.

బు-లే-క:—వ. (అందరు) ఇక మాట్లాడకుండిన మీకుఁ మర్యాద దక్కును.

5 బు-క:—గీ॥ కోడెత్రాచులతో మైత్రిఁ - గొలుపవచ్చు
నగ్నిగుండములో నాట - లాడవచ్చు
సింహశార్దూలములతో వ - సింపవచ్చు
గాని మూర్ఖులతోనెందు - గలియరాదు.

వ. (తనవారితో) "అయితే అన్నిటి అంతము సమీపమై యున్నది. కాగా మీరు స్వస్థబుద్ధిగలవారై ప్రార్థనకుఁ

వీలగునట్లు మెళుకువగా నుండుడి." I పేతురు 4:7. ఇక వీరి స్నేహామింతటితో నాపి త్వరగా వెళ్లుదము రండు.

(నిష్క్రమింతురు).

5 బు-లే-క:—ఔరా! వారి గర్వమునకు మేరలేకున్నదే! దాపు జేరి వెఱువక యిటువంటి పొగరుకూతలు కూసి వెళ్లిరే. నిక్కువముగా నీ నీచులకు చులకనైనందువలనగదా! మన మంత కఠినులమున్నా వారంత దయార్ద్రులా! వాదమునకే గాబోలును ఒక్కసారిగా మాప్రక్క జేరిరి. నోళ్లు మాటలాడుచుండ నోసల్లెక్కిరించుచుండు టీవరకే గ్రహించి యుంటిని. మంచిగా నుండి మనికట్లు దెగనరుకు వారింకెవ్వరై యుందురు?

పాట. (ఎంత యాలోచనమువలె)

దాటిపోయిరా మోటువారు - ధైర్యమేమి లేక యించుక-దడసియుమనల - నిటులనెడబాసి యూహా ॥దాటిపో॥

1. ఇప్పటివరకుండినయెడ - చప్పుడేమియు లేక - తప్పుకుండ గొట్టి వారల నెట్టిపారదోలెదమే ॥దాటిపో॥

వ. అయిన భయపడి పారిపోయినవారిపై కోపము జూపుట చాల భ్రష్టత్వము. అరచినకొలది గొంతుకపోవుటే గాని ప్రయోజనమేమున్నది? ముక్కున్నాళ్ళు పడిసెముండక పోదు, ఆ దౌర్భాగ్యులఁ దలఁచినను దారిద్ర్యమే.

సీ॥ ఎప్పుడో రాకకు - నేల మనకు గోల
పోయి యున్నారమ్మ - పోరు వదలి
రాకాసులను బోలి - రక్కంగ సిద్ధమై
యెట్టులో జనిరమ్మ - యేమిటోను

భూతగణము బోలి - భీతుల గావించి
ఒక్క-సారిగ పోయి - రెక్క-జముగ
మనసు విసుకుపీడె - మనకిప్పుడే శాంతి
నిద్రబోదమమ్మ - నిమిషమైన,

తే॥ గీ॥ వెంటనే మేల్కొ-నియు మన - నింటనున్న
దివిటికర్రల సన్నియు - దీసికొనియు
సిద్దెలన్నింట జముగను - శీఘ్రముగను
కొనియుఁ దేవచ్చునుంగదా - కోరినంత.

వ. పండుఁడు పండుఁడు కునికిపాట్లు లేక కొంత నిద్రఁ జెంది యా మైదుగురికంటె ముందువెళ్లి వారలనే హేళన జేయుటకుఁ బ్రయత్నింతము. ఇంకొక్క సంగతి మీయందరికి నొక్కి చెప్పవలె శ్రద్ధవహించి వినుఁడు. మనలో ముందెవ్వరు మేల్కొ-ందురో వారు త్వరపడి అందరిని లేపవలెను. ఈ చిన్న మాట మీ మనములందు గట్టిగ నిడుకొని నిద్రించుడు.

(నిద్రించెదరు.)

దశకన్యా ప్రబోధము

ద్వితీయ రంగము

(బుద్ధిగల కన్యలు దివిటీలను సిద్దెలనిండ గ చమురును దీసికొని ప్రవేశింతురు)

1 బు-క:—"అబ్బా యెంతనిద్రలో నుండిరి. పిడుగు పైబడి నను మేల్కొ—ననట్లున్నారే? వారి అవివేక హృదయము అంధకారమయమాయెను. తాము జ్ఞానులమని చెప్పు కొనుచు బుద్ధిహీనులైరి." రోమా 1:22.

2 బు-క:—ఇటువంటి తిండిబోతులు లేచుట గూడనా? వీరికి తోడు రోషముగూడను.

3 బు-క:—ఇంతవరకును దివిటీల యేర్పాటులే చూచుకొని యుండలేదు. సిద్దెలు మాత్రము తాము బుద్ధిగలవారని సూచించునట్లు సిద్ధముగా నుంచిరి.

4 బు-క:—ఇంకా సోమరివారి జోక్యమేల? నొకట—సారిఁజెప్పిన బుద్ధి లేదా? మరల ఛీ ఛా! యని యనిపించుకొనుట కంత యాశగొనియున్నారా?

5 బు-క:—అదుగో! పెండ్లి కొమరుఁడు దాపునకు వచ్చు చున్నాఁడు. మీ యధిక ప్రసంగముల నాపి దివిటీలను వెలిగించుఁడు. వృధా ప్రసంగములతోడను, నసంబద్ధ ప్రలాపములతోడను, వ్యర్థకలహములతోడను కాలముఁ గడిపిన నేమి ప్రయోజనము?

(దివిటీలను వెలిగించుచు యీ క్రింది నీతివాక్యములు చెప్పెదరు)

1 బు-క:—"భూమికంటే ఆకాశమెంత ఉన్నతముగా నున్నదో ఆయనయందు భయభక్తులు గల వారియెడల ఆయన కృప అంత అధికముగా నున్నది." కీర 103:11

2 బు-క:—"దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము." రోమా 8:28.

3 బు-క:—"యెహోవా దృష్టి నీతిమంతులమీద నున్నది. ఆయన చెవులు వారి మొరలకు ఒగ్గియున్నవి." దా. కీ. 34:15.

4 బు-క:—"అయినను మనమాయన వాగ్దానమునుబట్టి క్రొత్త ఆకాశము కొరకును క్రొత్తభూమి కొరకును కనిపెట్టుచున్నాము. వాటియందు నీతి నివసించును." II పేతురు 3:13.

5 బు-క:—"అయితే ఆయన వెలుగులోనున్న ప్రకారము మనమును వెలుగులో నడచినయెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము." I యోహా. 1:7.

రాగం-శంకరాభరణము పాట (అందరు) ఆదితాళము.

(వెలుగుచున్న దివిటీలతో వెళ్లుచు పాడుదురు)

జయ జయ మంగళ-జయ మంగళమని-జయగీతము బాడ జనుద మికె - జయగీతము బాడ ॥జయ జయ॥

1. పూలహారంబులతో - విలసిల్లు దండలతో - మేలగు తోరణ - ముల సముదాయముతో ॥ జయ జయ ॥

1 బు-లే-క:—(మేల్కొని యులికిపడిలేచి) అయ్యో! అయ్యో! పెండ్లికుమారుడు వచ్చెను. లెండి లెండి మనతో వాదించిన వారు అన్నియు సిద్ధపర్చుకొని దివిటీలను వెలిగించుకొని వెళ్లుచుండిరి. ఏమి? యింకను పండియే యుంటిరా! బహు త్వరగా లేచి వెళ్లుదమంటిరే? ఎవరికిని మెలకువ లేకపోయెనా? ఎంత నిర్భాగ్యులము?

రాగం - వసంత. పాట తా—ఆది.

కాలము వ్యర్థముగా గడిపియుండ - కట కట రాకడ గాంచగలమా? ॥ కాలము ॥

1. మోసపోతిమి లేచి రండిక - ఘోషమున నొసటఁ వ్రాసియుండ ॥ కాలము ॥

2. అర్థరాత్రియే అయ్యో నేఁడు లేగుదు - సాధ్యమానా? నూనెగొనుటకు ॥ కాలము ॥

2 బు-లే-క:—సాధ్యమేల కాదమ్మా! యిప్పుడైనను త్వరపడి చేసిన అసాధ్య పనియైన యాగునా! ప్రస్తుతము మన సిద్దెలలో నడుగుభాగములయందు కొద్ది కొద్దిగా చమురుయుండి యుండవచ్చును. నొకపని కాగుపని నా యూహ (యిద్దరిని ముందుకుదీసి) మీ రిరువురును మన గృహముల యందున్న దివిటీల కొరకు పరుగుదియ్యుడి. మీరు వచ్చేసరికి మేము మువ్వురము సిద్దెలలోని అడుగు చమురు గరిటెలతోఁదీసి యెదురు జూతుము. మీరు వచ్చిన వెంటనే మా గరిటెలలోని చమురును దివిటీలపై బోసి వెలిగించెదము. అప్పు డనలీలగా నా మహనీయుని మనముకూడ నెదుర్కొను వార మగుదుము. తదుపరి

సిద్ధపడియున్న కన్యలయొద్ద బదులు తీసికొనవచ్చును. ఈ రోజు యిట్లో రేపు మట్లో. ఈ కష్టలు యెల్ల కాలముండునా? అపాయము రాకుండ నుపాయము వెదుక వలెను సుమీ? వీరు బోకముందే మీరు రావలెను. త్వరితముగా బొండు. వెంటనే రండు.

(4, 5 బు-లే-కన్యకలు నిష్క్రమింతురు)

(1,2,3 బు-లే-కన్యకలు సిద్దెలలోని నూనె గీరి తీసెదరు.)

1,2,3 బు-లే-క:—అయ్యయ్యో! అరగరిటెడైనఁ గాలేదే? ఇదె క్కడి కానునో మాకు దోచకున్నది. (తడబడు చుందురు).

(4, 5 బు-లే-క:—దివిటీలు తెచ్చెదరు)

4,5 బు-లే-క:—వేయుడి వేయుడి ఆలస్యమగునేమో

1,2,3 బు-లే-క:—ఏమి వేసెదమమ్మా గట్టిగాపట్టి తుడిచి తీసినను నొక్క యరగరిటెడైనఁ గాలేదు.

1 బు-లే-క:—మన పనియంతయు వేళాకోళముగా నున్నదే? బాగుగా నంచుడి. ఊరకుండలేక యురిబెట్టుకున్నట్లు లేని పోని తగవులుపెంచి గోరంతలు కొండంతలు జేసికొని యిట్టి స్థితికి పాలైతిమి.

2 బు-లే-క:—వేసిన కొంచెము నేపైనఁ వెలుఁగక అప్పుడే యారి పోవుచున్నదేమమ్మా?

3 బు-లే-క:—ఆరిపోవుచున్న దివిటీలనుబట్టి ఆలాగే నిలచి యుండుటేల?

4 బు-లే-క:—సిద్ధపడియున్న బుద్ధిగల కన్యలయొద్దకుఁ వెళ్ళి కొద్దిగా బదులివ్వుఁడని ప్రాధేయపడి యడుగుదము. వారు తిట్టినను కొట్టినను, మరేమి చేసినను యెవ్వరేమి మాట్లాడవద్దు. అనగా ఆ సమయమునకుఁ "అల్లరితో గూడిన ఆటపాటలైనను, మత్తయినను, లేకయు కామ విలాసములైనను పోకిరి చేష్టలైనను లేకయు, కలహమైనను, మత్సరమైనను లేకయు, పగటియందు నడుచుకొనునట్లు మర్యాదగా నడుచుకొందము." రోమా 13:13, రండు వెళ్లుదము.

(నిష్క్రమింతురు)

దశకన్యా ప్రబోధము

తృతీయ రంగము

(5 గురు బుద్ధిగల కన్యకల ప్రవేశము. పాడుచు ప్రవేశింతురు)

రాగం—శంకరాభరణము. పాట ఆదితాళము.

జయ జయ మంగళ - జయ మంగళమని - జయగీతము బాడ - జనుదమిక - జయగీతము బాడ ॥ జయజయ ॥

2. బంగారు రాజని - రంగగు ప్రభువని - మంగళ ప్రద ముగ సంగీతములతోడ ॥ జయ జయ ॥

1 బు-క:—అక్కలారా! నాకొక చక్కని యోచన దోచె. నిలువుడి. మన మా పెండ్లికుమారు నెదుర్కొనుటకుఁ అన్నియు సిద్ధపర్చుకొని ఆనందముగా వెళ్లుచున్నాము. సరే మంచిది. కాని మన కాపరమాత్ముని సహాయము లేకున్న యెట్టులా ప్రభుని యానందములో పాలుబొంద గలము. గావున కొంతసేపు శ్రీ యెహోవా దేవుని సహాయము కొరకై మౌనధ్యానము జేసికొందము మోకరించుడి? (అందరు మోకరించుచు) ఔనౌను మన మెంత మరచితిమి? (ప్రార్థింతురు)

(బుద్ధిలేని కన్యలు ప్రవేశము - పిరికి తనముతో వచ్చుట)

5 బు-లే-క:—సోదరీమణులారా! వందనములు (అందరు నమస్కరింతురు)

1 బు-క:—ఇప్పటికి గాబోలు వీరి మెలుకువ కంస్లు వాయునట్లు నిద్రించి వచ్చిరే?

2 బు-క:—ఆహా! పయోముఖ విషకుంభములు సుమీ?

3 బు-క:—అయిన వీరి భక్తి వీధిలోగొట్టి యింటిలోకాళ్ళు బట్టి నట్లున్నది. క్రొత్తగా నుద్భవించినది గాబోలు

4 బు-క:—నకట వినయములకు కొంగ భక్తికి మేరలేదు గదా?

5 బు-క:—నిజముగా వీరు వేషధారులును తాత్కాలికముగా మాట్లాడువారును, కఠినచిత్తులును వెన్నరీతిగా గరుగు నట్లును కొండలు పిండియగునట్లును బల్క సామర్థ్యముగల నేర్పరులు సుమీ?

బు-లే-క:—ఆ॥ వె॥ అమ్మలార మిమ్ము - నడుగున దొకటే
దయను జూపి మమ్ము - దనరజేసి
దివిటి లారుచుండె - దిక్కు మీరేగదా?
చమురు బదులు నిండు - సంతసమున ॥

1 బు-క:-నాఁటిదినమునఁ మీరు మమ్ముఁధిక్కరించి వెక్కిరించి నిక్కి నీల్గినందుకా? లేక నిందించినందుకా? వీలుపడదు వీలుపడదు. మాకే చాలదని మేము తహతహ లాడు చున్నాము. అమ్మువారియొద్దకు వెళ్ళి కొనుక్కొనుఁడు.

1 బు-లే-క:—చెలియలారా? దండములు బెట్టెదము. ఈ సారికి తట్టుకొనువారు మీరే యని మి మ్మాశ్రయించితిమి. కొనే విషయము మీరు చెప్పవలెనా?

బు-లే-క:—(అందరు)

పాట—చాయ:—సఖ్యాన రాజ నీవోయి

మా మనవి నాలకించండి చెలియరో - మరుపబోమండి=
తామసము జెంది మీపైన - తప్పుగను తరచియుంటిమి - జామైన
లేదు ప్రొద్దండి స్వామిని జేరలేమండి ॥ మా మనవి ॥

2. రెట్టింపు ముట్టజెప్పెదము చమురును - పట్టువీడండి=
నెట్టిన పోము మేమండి నిజముగా - నెనరు జూపండి - జట్టుగా
కలసిపోవుదము యిప్పుడే జయము దేరండి ॥ మా మనవి ॥

న. అమ్మా మీమాట ముందే విన్న యిదంతయు నుండదుగదా?

3 బు-క:—సీ॥ మేమెంత జెప్పిన - మెడవంచ రైతి రే
యిప్పుడేల వచ్చు - టిచ్చటకును
నీతిమాటలు జెప్ప - నీచమై యుంటిమే
యెంతవారము మేము - కొంతనివ్వ
సామ్మెయుండగ మీకు - సోదిమాటలవేల
పొందు మాతో మీకు - పోరువచ్చు
కాంతలెన్నియొ మీకు - గలిగియుండగ నింక
బ్రతిమాలు టదియెంతొ భ్రష్టతయగు
తే॥ గీ॥ ఇన్ని యేర్పాటు లుండఁగ - నింక యేమి
మమ్ము పరిహాసింపగ నిట్లు - మరలినార
భళిరె! చాలు మీ బంధుత్వ - బలిమి మాకు
పొందు పోయము మీ కొక్క - బొట్టు గూడ.

3 బు-లే-క:—అబ్బో! వెనుకటి శౌర్యమంతయు యిప్పుడు వెళ్ళఁబొంగుచున్నదే! (కోపముతో) కొంచెము చిన్నగా మాట్లాడరాదా? ఇన్ని దెప్పిళ్లేల. పోయమంటే పోమా?

ఆసలడగక పోదుముగాని, అమ్మువారి యొద్దకు వెళ్లి కొని తెచ్చుసరికి పెండ్లికొమరుఁడు నగరులో బ్రవేశించునను భీతి మమ్ములబట్టి బాధించుచున్నది. అయిన లోభి వారియొద్దకుఁ జేరుటే తప్పు. దమ్మిడీ దొరికిన దాని కేడుముడులువేసి మురియుచుందురు. మీరీతుచ్ఛ చమురుబుట్టనిచ్చెదరా? అల్పుల కైశ్వర్యమువచ్చిన అర్ధరాత్రివేళ అద్దము జూతురు.

4 బు-క:—ద్రాక్షపండ్లందని నక్క చేదన్నట్లున్నదే? పోస్తే మంచివారమున్న పోయకున్న చెడ్డవారమా? సిద్ధపడుడని చిన్నపిల్లలకు వలె బుజ్జగించి చెప్పియుండ మావే బుద్ధిలేని మాటలుగ భావించి లెక్కజేయకుంటిరి. ఇంకెందుకీ నిష్ఠురోక్తులు?

4 బు-తే-క:-ఆ॥ వె॥ నిజము జెప్పుమీరు - నీల్గియుంటిమి మేము
జ్ఞానమేమి లేక - హీనమతుల
మేమిలాభమిప్పు - డేచ్చిన ఫలమేమి
ఇంత తప్పుమాకు - నిమిడియుండ॥

వ. అక్కలారా! తెలిసియున్న యీ విధముగా పొరబడుదుమా? అజ్ఞానాంధ కారములో గ్రుంకిడుచుండు మాకు మీరు నీతిమాటలతో నిజముజెప్ప కోతులబోలి లోతునెరుఁగక మూతులువిరచి భీతిపెట్టి నెట్టివేసిన మేము తప్పని ముమ్మారునొప్పుచుండ మాయందు మీయనురాగముఁ జూప వేడుచున్నారము. దయచేసి యింకొకమాట చెప్పుడి.

5 బు-క:—మీరు తప్పని యొప్పుకొన్నను ఒప్పని యొప్పుకొన్నను తన్నుకొని చచ్చినను నొక్కబొట్టు నూనెయైన మీకు ముట్టుననుమాట కల్ల. త్రికరణ శుద్ధిగ దెల్పితి

నమ్ముడు? "దుర్నీతిచేత సత్యమునడ్డగించు మనుష్యులయొక్క సమస్త భక్తిహీనతమీదను దుర్నీతిమీదనను దేవుని కోపము పరలోకములో నుండి బయలుపరచబడుచున్నది." రోమా 1·18.

సీ॥ ఇచ్ఛకంబులు వగ - లిగి లింపులను నేర్చి
పరుల కొంపలు ముంచు - పడతులార
జుట్టు జుట్టుకుముడి - బెట్టి కల్లల నల్లి
నవ్వ జూచెడు చుప్ప - నాతులార
పరుల బ్రతుకుఁజూచి - పగమచ్చరములూని
కొండెముల్ సాధించు - కుమతులార
అపవాద భరమవ్వ - లానుచో మది దొట్రు
పాటుగల పిరికి - పందలార

తే॥ గీ॥ ఇంతకును మున్ను జెప్పియు - న్నంతకన్న
జెప్పజాలము చమురుకై - యవ్వలార
తప్పు మార్గపు శిక్షయు - దప్పనేల
వెడలు డిప్పుడే మము వీడి - వెడఁగులార॥

5 బు-లే-క:—చచ్చిన సర్పమును నెంతగొట్టిన నేమిప్రయోజనము? మా యావజ్జీవములుఁ గ్రుంగి కూలబడి కుమిలి యుండ నింకేల మమ్ముఁ గుములఁజేసెదరు? ప్రస్తుతమపు డెన్నస్నఁ బడవలసివచ్చె గట్టెక్కినవారుగదా? మిట్టిపడుట (తనవారివైపుఁజూచి) ఏమమ్మా కొమ్మలార! అట్లే బొమ్మలు చేష్టలిమ్ముజెడి యబ్బురమ్ముతో గమ్మున నా పిధముగానే నిశ్చేష్టులై నిలువఁబడి యుంటిరి. రాజకుమారునితో రాగాలుదీయుచు చేతోమోదంబుగా తమ చేతులు జాపి

చూపుచు నావిందులో వియ్యమొందబోవుచున్న వీరితో మనము సాటియా? కొంచెము సహాయముచేసిన నెంత సేపైన నుండవచ్చును. ఏమిలాభము! ఇదంతయు మన చింతకు వచ్చినది. ఇక తడవుసేయక వర్తకుల యొద్దకు వెళ్లి ప్రతిమాలి లేవలేకున్నను లేవఁదీసి నూనె తీసికొని వచ్చెదము రండు.

(నిష్క్రమింతురు.)

౫ - కన్యలు - (పెండ్లికుమారుని రాకయొక్క సంభ్రమ ధ్వనులు విని).

(అందరు) - అదుగో మనప్రభువు మంగళసంగీత వాద్యధ్వనులతోను గొప్ప భూరధ్వనితోను, మహోద్భాటముగా వచ్చుచున్నాఁడు.

రాగం—శంకరాభరణము. పాట. ఆదితాళము.

జయజయ మంగళ - జయమంగళమని - జయగీతము బాడ - జనుదమిక - జయగీతము బాడ ॥ జయజయ ॥

3. రంజిక రాజుయొక్క - పెండ్లివిందుకిమన - యుండ యామహాత్ముఁడు - దండిగ దాతనిరతం ॥ జయజయ ॥

4. విందుదొరికెనే - మందు మనభాగ్యము - సుందరాకారునితో - సుఖము నొందగసతము ॥ జయజయ ॥

నిష్క్రమింతురు.

దశకన్యా ప్రబోధము

చతుర్థ రంగము

(బు. కన్యలు వెలుగుచున్న దివిటీలతో పెండ్లికుమారుని వెంటాడుచు)

పాట. (యేసుదేవరా వలె)

అందరు—హారతిగొనుమా జయ - హారతిగొనుమా - ఆ ఆ ఆ
|| హారతి ||

1. మేలుజేయువాడ నిను - చాలనమ్మి యుంటిమి మా
పాలగావుమా మ - మ్మేలప్రోవుమా - ఆ ఆ ఆ || హారతి ||

2. మోసపోక నాశజెంది - భాసుర నిన్నాశ్రయించ - ధీర
గావుమా మా - యీశ జూడుమా - ఆ ఆ ఆ || హారతి ||

3. కోలహాల కారణంబ - జాలియెదన సూత్రంబ - మేలు
భూషణ, మా - వెలుగు తేజమా - ఆ ఆ ఆ || హారతి ||

(ఈ ఐదుగురు నీతివాక్యములు చెప్పుచు ఒకరి తర్వాత నొకరు
పెండ్లికుమారుని నగరులో ప్రవేశింతురు).

1 బు-క:—"మరి యెవనివలనను రక్షణ కలుగదు. ఈ నామమునసే మనము రక్షణ పొందవలెనుగాని, ఆకాశముక్రింద మనుష్యులలో నియ్యబడిన మరియే నామమున రక్షణ పొందలేము." అపొ. కార్య. 4:12. కావున మీ నడుములు కట్టుకొనియుండుడి. మీ దీపములు వెలుగుచుండనీయుడి. తమ ప్రభువు పెండ్లివిందునుండి వచ్చి తట్టగానే అతనికి తలుపుదీయుటకు అతడెప్పుడు వచ్చునో అని అతనికొరకెదురుచూచు మనుష్యులవలె నుండుడి." లూకా 12:35,36.

2 బు-క:—"ఇప్పుడు క్రీస్తు యేసునందున్నవారికే శిక్షావిధి యును లేదు. రోమా 8:1. మనుష్యకుమారుడు మహా ప్రభావముతోను మహిమతోను, మేఘారూఢుఁడై వచ్చుట చూచెదరు. అప్పుడాయన తన దూతలను పంపి భూమ్యంతము మొదలుకొని ఆకాశాంతము వరకు నలుదిక్కుల నుండి, తానేర్పరచుకొనిన వారిని ప్రోగుచేయించును." మార్కు 13:26,27.

3 బు-క:—"ప్రభువువచ్చి యే దాసులు మెళుకువుగా నుండుట కనుగొనునో, ఆ దాసులు ధన్యులు. అతడు నడుము కట్టుకొని వారిని భోజనపంక్తిని కూర్చుండబెట్టి తానే వచ్చి వారి కుపచారము చేయునని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను." లూకా 12:37.

4 బు-క:—"అయితే ప్రభువు దినము దొంగ వచ్చినట్లు వచ్చును, ఆ దినమున ఆకాశములు మహాధ్వనితో గతించిపోవును. భూతఃములు మిక్కుటమైన వేండ్రముతో లయమై పోవును, భూమియు దానిమీదనున్న కృత్యములును కాలిపోవును." II పేతురు 3:10.

5 బు-క:—"కావున యే దినమున మీ ప్రభువు వచ్చునో మీకు తెలియదు. గనుక మెళుకువగా నుండుడి. ఏ జామున దొంగ వచ్చునో యని యింటి యజమానునికి తెలిసియుండిన పక్షమున అతడు మెళుకువుగానుండి తన యింటికి కన్నము వేయనియ్యడని మీ రెరుఁగుదురు. మీ రనుకొనని గడియలో మనుష్య కుమారుఁడు వచ్చును. గనుక యే మీరును సిద్ధముగానుండుడి." మత్త. 24:42-44.

(నిష్క్రమింతురు).

దశకన్యా ప్రబోధము

పంచమ రంగము

(బు-లే-కన్యలు రమణయ్య యను పెర్తకునియొద్ద చమురు అడుగుట)

1 బు-లే-క:—(తలుపు తట్టుచు) రమణయ్యగారూ? రమణయ్య గారూ? ఏమండో రమణయ్యగారూ. ఎంత బిలిచినను పలుకరేమండి?

రమణయ్య—ఎవరు?

1 బు-లే-క:—ఏమిటండి.

రమణ:—అంటే నీపేరేమి?

1 బు-లే-క:—నా పేరు అజాకరూకమ్మ.

రమణ:—ఏమి కావలెనేమి? ఇంత యర్ధరాత్రమున వచ్చినారు

అందరు—అయ్యా! చమురుకావలెను.

రమణ:—సరె సరె యిప్పుడు వీలుపడదు, డబ్బాలు రాత్రియే వచ్చియున్నవి. ఇంతవరకు దేనిని కదిలించి యుండలేదు. అదియుగాక డబ్బాల ధ్వనివలన పసిబిడ్డలు మేల్కొని గోలజేసెదరు. ఈ గోలంతయు యెందుకు వేరే కొట్టుకు వెళ్లుడు.

2 బు-లే-క:—మరెట్లానండి. కాతా కొట్టున్నదని నిద్రించి, మిమ్ము నమ్మి యిచ్చోట కొచ్చియుంటిమి. పెండ్లికుమారుఁడు వచ్చువేళయైనది.

రమణ:—నన్ను నమ్ముకొనుఁడని మిమ్మెన్నఁడైనఁ బ్రతిమాలితినా? వేళగానివేళలో వచ్చి యెందుకు గోలజేసెదరు?

3 బు-లే-క:—ఏమండీ! మా యాశ నిరాశజేసితిరే? అయ్యయ్యో మా దేహము చల్లబడి, కాళ్లు తోళ్లయి, నడువ శక్తిలేక, హృదయ మదిరిపడుచు, కాయము కంపమొందుచున్నది. గోరుచుట్టుపై రోకటి పోటన్నట్లు, అంతయు మాకు బాగుగా కలసివచ్చుచున్నదే?

రమణ:—మితిమీరి అరువకుడు?

4 బు-లే-క:—పొమ్మనలేక పొగబెట్టినట్లున్నదిలే. పోయనని చెప్పరాదా? ఇన్నిసాకులేల, నీవు మాకొక గొప్ప సాహుకారివి గాబోలు మొయిలునమ్మి చెరువుగట్లు తెగగొట్టుకున్నట్లాయె. ఏమయ్యా రమణయ్యా! బాగుగా జేసియుంటివే? ఏమి నీ సొమ్మెగగొట్టియుంటిమి?

రమణ:—ఏమి యెగగొట్టితిరో యది మీకే తెలియును, విప్పి చెప్పవలెనా? ఎన్నిసార్లు నాపద్దులో మోసముజేసి దిద్దించి యేడ్పించలేదు? రూపాయిసరుకు వాడి అర్ధరూపాయి యనియు, పావలాది వాడి బేడదనియు, నొక్కొక్క సమయమున నేమియు లేదనియు చెప్పి ప్రాణము విసికించి యుంటిరి. ఇక మీ కాతా చాలు వెళ్లుఁడు.

5 బు-లే-క:—అమ్మయ్యో! ఎప్పటిదో మది నుంచుకొని యిప్పుడీ మోసము జేసియున్నాఁడు. రొక్కము చేతిలో వేసినను, యిచ్చే కళలేమియుఁ గాన్పించుటఁలేదు. మితిమీరి యడిగిన మీఁదకు దుముకునంత కోపావేశుఁడై యున్నాఁడు. విశేషకాల మిక్కడే గడపిన, పెండ్లికుమారుఁడు వెళ్లి

పోవును. కావున నే నెరింగియున్న మార్గమొకటి దెల్పెద. సావధాన చిత్తులై వినుఁడు. పెద్ద బజారునకు తూర్పు భాగమున పెద కోటిరత్నముగారొక కొట్టును క్రొత్తగా స్థాపించి సాగించుచున్నారు. అచ్చోటకు వెళ్లి సొమ్ము జూపించిన, సాక్షి గాఢనిద్రలో నున్నను తప్పక లేచి యివ్వ గలఁడని నా యూహా. వెళ్లుదము రండు.

(నిష్క్రమింతురు).

దశకన్యా ప్రబోధము

షష్ఠమ రంగము

(5 గురు బుద్ధిలేని కన్యలు కోటిరత్నమను కోమటియొద్ద చమురు గొనుట)

5 బు-లే-క:—(తలుపు తట్టుచు) కోటిరత్నముగారూ కోటి రత్నముగారూ!

కోటిరత్నము:—ఎవరెవరు (తలుపు దెరచును) ఏమి కావలె నేమి?

అందరు:—అయ్యా చమురు కావలెనండి.

కోటి:—ఎంత కావలెనేమి?

1 బు-లే-క:—ప్రస్తుత మూడువీసెలు కావలెనండి.

2 బు-లే-క:—వీసెంత జెప్పుచున్నారో?

కోటి:—ఆ యెంతలే పదియణాలన్నర మిమ్ము గావలసి ఆ పై చిల్లర దీసివేయుచున్నాను. నా కొట్టుకు మీ రెప్పుడు రాలేదేమో! అంతయు నమ్మకమైన సరుకే. అనేకులాయా కాతాలనుగూడ వదలి నాయొద్దకు వచ్చుచున్నారు. లాభ మునుగూడ నేనెక్కువ గోరను. గనుకనే నన్నందరు నమ్మెదరు.

3 బు-లే-క:—ప్రస్తుతము కర్తవ్యము జరిగిన, అంతే చాలును! మమ్మును మీరు నమ్మవలె, మిమ్మును మేము నమ్మవలె.

ఇదియే గదా వతను. (త్వరపడుచు) ఇప్పుడిప్పుడి ఇప్ప టికే చాల ప్రొద్దు పోయినది. (చమురు తీసికొందురు)

4 బు-లే-క:—పరుగెత్తిరండీ యిప్పటివరకు ధన్యులమైతిమి మహా గణ్యులమైతిమి "రాత్రి చాల గడచి పగలు సమీపముగ నున్నది. గనుక మనము అంధకారక్రియలను విసర్జించి తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము." రోమా 13:12.

5 బు-లే-క:—ఇల్లలకగనే పండుగౌనా! మన యదృష్ట వంశంబున పెండ్లికుమారుని రాకను వెనుకఁబడిన మన ప్రయాసమంతయు దీరి సౌఖ్యంబు జేకూరు. లేనియెడల దురదృష్టవంతులమై నిత్య దుఃఖాబ్ధియందే యీదవలయును గదా?

4 బు-లే-క:—అక్కా అట్లనకు, శుభసూచకమునకు యిటు వంటి యపశకున యుద్దేశములు గలిగియుండుటయు, మనమున యించుక సంశయ మొదవిన నారంభించుటయు, యెంతటి యవివేకమో యోచించుము. కొంచెము నిబ్బరము గలిగియుండుము. "ఇక కాలము బహు కొంచెముగా నున్నది. వచ్చుచున్నవాఁడు ఆలస్యము చేయక వచ్చును." హెబ్రీ 10:37. కావున మనమును మంగళ గీతములు బాడుచు యీ మహనీయు నెదుర్కొన వెళ్లుదము రండు.

(పాడుచు బయలుదేరుదురు)

రాగం - కన్నడ. (అందరు) పాట అటతాళం.

మంగళమని పాడరే - శృంగారునకు ॥ మంగళమని ॥

1. సంగీత ధ్వనులతోఁడ - సత్ ప్రభురాకకు = సమయ మిప్పుడుగూడె - సంతోషము ॥ మంగళమని ॥

2. ప్రథములోబోయిన - సుదతుల రాకేది = సదనము నకు యింక - సాగలేదేమొ ॥ మంగళమని ॥

(బాటసారి ప్రవేశము)

బాటసారి:—అమ్మలారా! మీ రెవరికోసర మెదురు జూచు చున్నారు?

అందరు:—పెండ్లికుమారుని కోసరము. నీ వెరుఁగవా యేమి? ఎంత నిర్భాగ్యుఁడవు!

బాటసారి:—నా నిర్భాగ్యత కేమిలే, మీ దౌర్భాగ్యత దెలిసి కొండి.

1 బు-లే-క:—ఏమిది! మేము దౌర్భాగ్యులమా? నీబోటి బాటసారికిఁ గూడ చౌకయైతిమా?

బాట:—అమ్మలారా! మిమ్ము నిందించవలెననిగాదు, చౌక యైనందువలనఁగాదు, కాని మీ యజాగ్రత్తవలన బోగొట్టుకొనిన పెండ్లికుమారుని యానందభాగ్య మొంద లేరని నా చింత.

2 బు-లే-క:—సరెసరె యిక వెళ్లు, ప్రయాణస్తుడవైన నీకేమి యెరుక?

3 బు-లే-క:—ఆ మహాప్రభువుయొక్క యానందములో పాలు బొంది యనుభవించినట్లు చెప్పుచున్నావే?

4 బు-లే-క:—ఆయన రాకడ దొరకటమున్ను నీవు తిరిగి రావడమా?

5 బు-లే క:—అమ్మలారా! అట్లనకండి, మన ప్రక్కజేరి శ్రద్ధగా నాయన రాకకు సిద్ధపడుడని చెప్పిన బుద్ధిగలవారి మాటలు విననందు వలనగాదా, యిట్టి యిక్కట్లు! ఆయనవాక్కు చక్కగా తలంచుడి.

బాటసారి:—

చ॥ నిజమును దెల్పగా భువిని - నీలిగె నీచతనంబు జంపరే
భజనలు జేయుచుం ప్రభుడు - బాటను బోవుచునుండ [గాంచితిం
గజగజలాడి లాభమును-గానగబోరు తొలంగె పుణ్యముల్
నిజగతి దెల్పుచుండగను - నింకను గోరక యేగుడిచ్చటం

వ. మీ రెందరో యందరు వెలుగుచున్న దివిటీలతో జయోత్సవముగా మంగళ గీతములు బాడుచు నా మహనీయుని వెంట వెళ్ళిరి. "శరీరానుసారులు శరీర విషయములను మనస్కరింతురు. ఆత్మానుసారులు, ఆత్మవిషయములను మనస్కరింతురు." రోమా 8:5.

అందరు:—(ఆశ్చర్యముగా) వెళ్లకున్న యీ బాటసారి యింత గట్టిగా మాట్లాడునా?

బు-లే-క:—అందరు అయ్యో! నిజముగా వెళ్లిరా?

బాట:—వెళ్లిరమ్మా నే కండ్లార జూచితిని.

(నిష్క్రమించును)

బు-లే-క:—అందరు కటకటా దౌర్భాగ్యులమైతిమి. దౌర్భాగ్యుల మైతిమి.

వ॥ మన దీర్ఘాలోచనలన్నియు బూడిదలో నెయ్యి బోసిన చందమాయెనుగదా! బట్టెపాడెన్నాళ్లు, భాగ్యమెన్నాళ్లు?

1 బు-లే-క:—సీ॥ అయ్యయో యింకేమి-యానందముమనకు
అన్నియు నడుగంటె - నాశలేదు

2 బు-లే-క:—ఎన్నియో కష్టము - లెంతగా బడినను
ఫలితమే లేదయ్యె - పడతులార

3 బు-లే-క:—ఏమి చేయుదుమమ్మ - యెచటికేగుదమమ్మ
ఎవరు దిక్కగునమ్మ - యెంచిచూడ

4 బు-లే-:క—బుద్ధితో గన్యలు - సిద్ధము గండంచు
ముద్దుతో జెప్పిన - శ్రద్ధలేదె

5 బు-లే-క:—ఆ॥ వె॥ ఇప్పుడిటుల వగవ - నిష్టమాయె మనకు
నేమిలాభమమ్మ - యేడ్వకండి
గుండెరాయిజేసి - దండియాగారాజుకు
తలుపు దీయుమనుచు - దట్టుడింక ను.

వ. రోటిలోతలదూర్చి రోకటిపోటునకుఁ వెఱుతుమా! కానున్నది కాకమానదు. మేలుదొరికిన కీడుదొరికిన అక్కడేడ్చుటే మంచిది. ఏల మనకిం కాలస్యము! త్వరితముగా వెళ్లుదము రండు.

(నిష్క్రమింతురు)

దశకన్యా ప్రబోధము

సప్తమ రంగము

(5 గురు బు. లేని. కన్యకలు పెండ్లికుమారుని నగరు యొద్దకుఁ వెళ్లుట)

అందరు:—(తలుపు తట్టుచు) అయ్యా మహానుభావా! నీ పాదాబ్జ సేవకులము వచ్చియున్నాము. మా యజ్ఞానత అజాగ్రత అతిశయములను జూడక తలుపుదెరచి మమ్మునుఁ జేర్చుకొనుడి (ఏడ్చెదరు)

పెండ్లికుమారుడు:—

ఆ॥ వె॥ ఎన్నడైన నెరుగ - నెవ్వరో మీరిట
కేలవచ్చియుంటి - రేమివింత
తిన్నగాను వచ్చి - నన్నందుకొనువారె
విందులోన పాలు - బొందువారు.

వ. వెళ్ళుడు. మిమ్మెన్నడును కని విని యెరుగను. మూయబడిన తలుపులు తెరువబడుట మీబోటి యజ్ఞానాంధకారులకా? తిక్క తెలియనట్లు తిని తారుమారై పండుకొను మీవంటి తిండిబోతుల కీ భాగ్యమబ్బదు. ఏకైక ధ్యానపరులై నా రాకకొర కెదురుచూచి నాలో కలసి నన్ను ఘనపర్చువారి కీద్వారములు తెరువఁబడును.

పాట. చా ము:—దయలేద బీదలపైన

కడు బీదవారము దేవా - ఏదారి లేదా? ఏదారి లేదా? = పడి పడి మ్రొక్కుచుంటి - ఫలితమే లేదా? ఫలితమే లేదా? ఫలితమే లేదా? ॥ కడు ॥

1. నిలువ చోటులేక - నిందపాలు గాగా = పాలుమాలి కన్యలలోన - చీలియుంటిమి విధానా - చీలియుంటిమి విధానా చీలియుంటిమీ విధానా ॥కడు॥

2. వీలేమిలేదా? మేలేమి రాదా? = జాలిగలిగియు మా పైన - జయము సేకూర్చండి - జయము సేకూర్చండి - జయము సేకూర్చండి ॥ కడు ॥

పెండ్లి కు:—గతించిన దానికి వగచిన ప్రయోజనమేమి? ద్వారములు మాత్రము తెరువఁబడు ననుమాట కల్ల త్రికరణ శుద్ధిగ దెల్పితినమ్ముఁడు.

పాట. చాయ:—ఓ! స్వప్నసుందరి

బు-లే-క:—ఓ! కరుణాహృదయుడా? పాపులమైతిమిగా నీకు - కోపము రేపితింగా ॥ ఓ! కరు ॥

1. చిక్కులోబడియు - దక్కక చమురు - చివరకి కైతిమిగా=చివరికికైమా జీవితమంత - చింతయు గలిగెనుగా ॥ ఓ! కరు ॥

పె-కు:—ఓ! దురితవర్గమా? వేరైపోతిరిగా నాకు - దూరము యైతిరిగా ॥ ఓ! దురి ॥

2. నాదురాకకై బోధకులంప - వాదనబెడితిరిగా=వాదన బెట్టి కాదని వినక - బాధలుపడితిరిగా ॥ ఓ! దురి ॥

3 బు-లే-క:—జాలము జేయము - మేలుకొందుము తాలిమి జూపండి=తాలిమి జూపి తరుగని కృపను - తప్పక నియ్యండి ॥ ఓ! కరు ॥

4 పె-కు:—చాటింపులతో నాదురాకను - తేటపర్చ లేదా? - తేటపర్చియు తెలిపియుండగా - మాట నమ్మలేదే ॥ ఓ! దురి ॥

1 బు-లే-క:—వ. మహాప్రభూ మా యజ్ఞాగ్రత్తా విధేయతలను బట్టి మాదే గొప్పతప్పని యొప్పుకొనుచుండ అంధకారబంధురములో జిక్కుబడియుండ నింతకాఠిన్యము జూపించ మేమెట్లు నిలువఁగలము!

పెండ్లి కు:—వ. "ప్రభువా ప్రభువా యని నన్ను పిలుచు ప్రతివాడు పరలోకరాజ్యములో ప్రవేశింపడు గాని, పరలోకమందున్న నా తండ్రి చిత్తప్రకారము చేయువాడే ప్రవేశించును. మత్త. 7:21" నారాకను గ్రహించి మేల్కొని, సిద్ధపడి నన్నెదుర్కొనువారే నావారనియు, అట్టివారు నా సంతోషములో పాలివారనియు, యింతకుముందే తెల్పియుంటిని: మీరేల నన్ను మాటిమాటికి పిలిచి విసికించి నా కోపము రేపుకొనెదరు. మీరు నాకు దూరపర్చబడి నిత్య దుఃఖాబ్ధిలో నిలిచియుండి యొక్కింత దీపకాంతియైనం జూపరాని నిరయ కూపంబునం ద్రోయంబడియుంటిరి. యిక నా గుమ్మమువద్ద లెండు.

2 బు-లే-క:—

శా॥ శాపగ్రస్త సమస్తదుర్జన మను - ష్యశ్రేయసంధాయకా
కోపంబాపి దయారసంబిడుము మా - కుక్ దీనరక్షామణీ
యాపైశాచిక తంత్రమే యిటుల నీ-యాపత్తునుంగూర్చెనో
యాపద్బాంధవ జేర్పవే మములనీ-యాశ్రంపుమాటుక్ సదా

3 బు-లే-క:—వ. అందని మ్రానిపండ్ల కాశపడినట్లు యెందు కీ ఘోష. ముందేబోయిన నా యానందములో బాలు బొందుదుము గదా? దుఃఖమనెడు నిప్పులకుంపటి మన నెత్తిన నిమిడియుండ నెత్తిగొట్టుకొనుచు మొత్తుకొన్న నేమి ప్రయో జనము?

గీ॥ కపట హృదయాంత రంగులౌ - ఖలుల కెపుడు
జయము గలుగంగ బోదు ని - జంబు దలప
గష్టజీవులౌ మనుజులే - ఘనత గాంత్రు
పొలుపుకలుగునె స్వర్ణంబు - బుటము నిడక.

వ. (తలుపు తట్టుచు) దేవా! ఇదే పోవుచున్నాము. కొండంతయాశతో బయలుదేరి అనంతదుఃఖము నొడిగట్టు కొని జనుచుంటిమి. వచ్చినయాపద వద్దంటేపోవునా?

పాట. చాయ:—రావోయి చందమామ

ఓ దేవ మొరనువినుమా - ప్రాధేయపడుట గనుమా ॥ ఓ దేవ ॥

1. బాధలన్ని దీసేయు - భవ్యంపు మూర్తి నీవె=వేదనల పాలుగాక - మోదంబు గూర్పవయ్యా ॥ ఓ దేవ ॥

2. మోక్షంబు మార్గమీవె - దాక్షిణ్య దాత బ్రోవె= శిక్షించకయ్య మమ్ము - రక్షించవయ్య దేవా ॥ ఓ దేవ ॥

3. పాపిష్టి ముసుకులోన బడిపోతిమయ్య స్వామి= శాపంబు బాపి మమ్ము - కాపాడవయ్య నాథా ॥ ఓ దేవ ॥

4. బు-లే-క-వ. ఓ యార్తనాథా! దీనరక్షకా! భక్తవత్సలా! పరాత్పరా! మాకేల యిట్టి దురవస్థ సంప్రాప్తమాయెను?

నీ సంకల్పమేమో యీ వసుధపై నెవరు గ్రహించగలరు. ఇదంతయు నీ మాయయే గదా?

5 ఋ-లే-క:—సోదరీ నీవెంత పంతపుమనిషివి? ఈ సంకల్ప మెవ్వరుగల్పించిరి. అయోగ్య ముష్కరులమైన మనమే గదా? ఏల యీ సత్యసంధుండైన సర్వేశ్వరునిపై బెట్టెదవు?

శ్లో॥ ఉత్సాహం, సాహసం, ధైర్యం బుద్ధిః శక్తిః పరాక్రమః
షడేతేయ త్రతిష్ఠంతి, తత్ర దేవో పితిష్టతి.

అనగా- ఉత్సాహము, సాహసము, ధైర్యము, శక్తి పరాక్రమము బుద్ధి అను యీయారును గలవానియందే దేవు డును గలఁడని యెరుగవా? దయా దాక్షిణ్యమణులై యీ పంచకన్యలనుదూరి॥ పారదోలి సంతతౌన్నత్యమై సర్వలోక ప్రశస్తనిస్తులంబైన నారాజాధిరాజు వాక్కును ధిక్కరించి, సౌఖ్యానంద సంప్రాప్తిఁ జెడగొట్టుకొంటిమి.

(ఒకరిపై నొకరు తప్పులు మోపుకొందురు)

2 కన్య-1 కన్యతో సీ॥ గోలగూడదుసుమీ - వీలుగాదనిచెప్పి
ముస్వరించుట నీది - మొదటితప్పు

1 క-2 క-తో తెలియునంచని జెప్పి - కలహకారిణివయ్యు
నిలచి వాదంబాడ - నీది తప్పు

4 క-3 క-తో కలియనిమాటల - కేలస్నేహమటంచు
నిర్హేతువుగ దిట్ట - నీది తప్పు

3 క-4 క-తో వేళకోళముగ మీ - గోలగూడదటన్న
నిందించి యుండగ - నీది తప్పు.

5 బు-లే-క గీ॥ జాలమగునని చెప్పియు - తూలనాడి
పైనబడి కొట్టనైయున్న - ప్రథమ తప్పు
తలచుకొన్నను మనకెన్నొ - తప్పులగును
కొంపగూల్చెను మనజేసి - కొన్న తప్పు

(అందరు) పాట (దేవుని మహిమ తెలియగ వలె)

మంచినిగోరి - మహినీతులు జెప్ప - మాన్యులమాటలు మదిగొనుడీ = జ్ఞానముగలయా - కన్యలద్రోసి చిన్నబుచ్చి చివరిట్లు జెడితిమి ॥ మనమేలుగోరి ॥

1. పెండ్లికుమారుని - కండ్లజూచుటకు - దండియాశమా యందుండ=గండమనెడి యీ - బండనిద్రలో - నిండుగబడి మేముండిచెడితిగా ॥ మనమేలుగోరి ॥

2. యేసురాకడ నెరుగకపోయిన - నాశనమె నీవసుధను =లేశమైన యాలస్యముజేసిన - మోసమెగూడును ముమ్మాటికిని ॥ మనమేలుగోరి ॥

(5 బు-లే-కన్యకలు యీ దిగువ నీతులు చెప్పుచున్నారు)

1 బు-లే-క:—ఐదుగురు బుద్ధిగల కన్యలవలె ప్రార్థనద్వార పరిశుద్ధాత్మయను చమురు మన హృదయములను సిద్దెలలో సమకూర్చుకొనుట కిదే సమయము. (మత్తయి 25:1). లేకుంటే బుద్ధిలేని మాబోటి కన్యలతోపాటు వ్యాకులము. ఆశాభంగము తప్ప మరేమియు నుండదు.

2 బు-లే-క:—నిజమైన సబ్బాతుకొరకు సిద్ధపడుటకు మన్నాను గూర్చుకొనే సమయమిదే, లేకుంటే దుఃఖము, బాధయు, తప్ప మరేమియు నుండదు. (నిర్గమ. 16:15,27). ఇది మా యనుభవము.

3 బు-లే-క:—గనుక మీరు పారిపోవుట చలికాలమందు సంభవింపకుండునట్లును అనగా మరణము అంత్యదినము అనే మహా శ్రమదినములయందు సంభవింపకుండునట్లును, లేక విశ్రాంతి దినమందైనను అనగా వెయ్యి సంవత్సరముల పరిపాలనలోను నిత్యవిశ్రాంతిలోను సంభవింపకుండునట్లును ప్రార్థించుడి. (మత్తయి 24:20). ఎందుకనిన యిట్టి మంచి సమయము తిరిగి రాదు.

4 బు-లే-క:—ప్రతివారును క్రీస్తు రాకడకొరకు తమ్మును తాము సిద్ధపర్చుకొనవలయును. అశ్రద్ధ జేసినయెడల మాబోటి బుద్ధిలేని కన్యలవలె నట్టి పరమానంద బంధురంబైన దేవ నందనుని సుందరంబగు పెండ్లివిందు మోక్షానంద శాశ్వత సుఖంబు లనుభవింపక దూరపర్చఁబడువారగుదురు. ఇది సర్వజనాంగ మంగీకరించవలసిన విషయమై యున్నది.

5 బు-లే-క:—కం॥ యేసుని వాక్కులకరణిఁ
జేసిన యాభక్తజనులె - చెన్నుగ ధన్యుల్
యేసుని వాక్కుల జగతిని
రోసినవారలకె నరక - రోదన గలుగున్.

రాగం—కాంభోజి. మంగళం ఆదితాళము.

మేరికన్యపుత్ర - యేసయ్య నీకె మంగళం = మేలుగరప
నరిగిన - మెస్సయ్య నీకె మంగళం ॥ మేరికన్య ॥

1. సిలువశిక్ష నొందిన జయ - శీల నీకె మంగళం = పలు
బాధలొందిన - బరమాత్మ నీకె మంగళం ॥ మేరికన్య ॥

2. పాపపరి హారకరయో - భవ్యనీకె మంగళం = పావన
నామయో - దేవనీకె మంగళం ॥ మేరికన్య ॥

3. సర్వసృష్టిజేసిన - సర్వేశ నీకె మంగళం = నుర్వి
ప్రేమయ్యనుఁ గాచు - నిర్వికార మంగళం ॥ మేరికన్య ॥

దశకన్యా ప్రబోధము

సమాప్తము.

ప్రభువు రెండవ రాకడ

రా. — మోహన. తా. — ఆట.

యేసయ్య రెండవ రాక - త్వరగ వస్తుంది [illegible] ॥ యేసు ॥

1. కొదమ సింహము పోల్కి - కోపముతో - వస్తాడు - [illegible] మనసుంచి మది మార్పుతో రండి - సదమలంబగు [illegible] యేసుని సర్వ జనాళికి - చాటింపు చేయుండి । యేసు ॥

2. దొంగవలె వస్తాడు - సంగతిక [illegible] - [illegible] పోతావు - భయముతో మేల్కొండి [illegible] మన [illegible] - [illegible] రంగు వెడిసోతుంది - [illegible] లేదండి ॥ యేసు ॥

3. [illegible] - [illegible] - నిండు [illegible] - [illegible] రాజవమంటే = బండలు [illegible] పోతాయి - [illegible] దాత [illegible] వుండే [illegible] ॥ యేసు ॥

4. మెరుపువలె వస్తాడు - [illegible] - [illegible] - అంతే చూపిస్తాడు = [illegible] దుష్టుల [illegible] - [illegible] నీతిమంతులను [illegible] ॥ యేసు ॥

5. [illegible] - [illegible] ప్రజలం [illegible] - పడిపోయి వుంటారు = చివరి [illegible] - ఎవరికైనా గాని - [illegible] - మరి తీర్పు యౌనంకే ॥ యేసు ॥

6. అబద్ధ ప్రవక్త - అధికమై యుంటారు - అసత్య [illegible] అంటించి పోతారు = నేనే యేసునంటూ [illegible] - [illegible] చెప్పు కథ వదువు [illegible] ॥ యేసు ॥

7. [illegible] తెనస్లెన్నో - [illegible] వుంటాయి - [illegible] నమ్మ కాలని - [illegible] = తల్లి పిల్లల తగవు [illegible] - తప్పక యిది గొప్ప సూచనని ప్రభు చెప్పె ॥ యేసు ॥

8. యుద్ధాలు [illegible] అబద్ధాలు [illegible] - దద్దరిల్లగ [illegible] రాజ్యాలు పై లేమ = పెద్దవారిలో కుటిల బుద్ధులు [illegible] - [illegible] వస్తుంది ఇది ప్రభువు మాటండి ॥ యేసు ॥

15026